

భవనాలకు కొలతలు

ప్రజాశక్తి -అనంతగిరి:పంచాయతీ పరిధిలో ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు రెస్టారెంట్, లాడ్జిలు, హెూటల్ ల పన్నుల వసూలుకు సచివాలయ సిబ్బంది మంగళవారం కొలతలు తీశారు. పంచాయతీకి సంవత్సరానికి పన్నులు సక్రమంగా చెల్లింపులు జరగక పోవడంతో పంచాయతీ యాజమాన్యం రంగంలో దిగి ప్రైవేటు ప్రభుత్వ ఇతర భవనాల సముదాయ చుట్టుకొలతలు, పరిణామాలను గుర్తింపు పనిలో నిమ్మగ్నమయ్యారు. పలుమార్లు పన్ను చెల్లించాలని నోటీసులు జారీ చేసినప్పటికీ ఆయా యాజమాన్యాల నుండి కనీస స్పందన రాక పోవడంతో పంచాయతీ నిర్ణయం తీసుకోవడం జరిగిందని పంచాయతీ సచివాలయం సెక్రటరీ శెట్టి బాలకృష్ణ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఎస్, నాగులు, సిబ్బంది పాల్గొన్నారు.



కొలుస్తున్న సిబ్బంది

ప్రభుత్వ నిర్బంధంపై జైల్‌భరో

-ప్రజా సంఘాల నేతల బైఠాయింపు- పలువురు అరెస్టు

ప్రజాశక్తి-విలేకర్ల బృందం

తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ అంగన్వాడీ, మున్సిపల్ కార్మికులు, సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె చేస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం నిర్బంధం ప్రయోగించడాన్ని నిరసిస్తూ రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా మంగళవారం జిల్లాలో జైలుభరో నిర్వహించారు. పలువురు నేతలను అరెస్టు చేశారు.

రంపచోడవరం :సిఐటియు అధ్యక్షురాలు మట్ల వాణిశ్రీ ఆధ్వర్యంలో అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు, మిడ్డేమీల్స్ కార్మికులు, స్కూల్ శానిటేషన్ వర్కర్లు, వెలుగు యానిమేటర్లు, గిరిజన సంఘం, ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు ర్యాలీ నిర్వహించి పోలీస్ స్టేషన్ ముందు బైఠాయించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ మాట్లాడుతూ సమస్యలను పరిష్కారం చేయకుండా, ఎస్మా ప్రయోగించడం దారుణమన్నారు. గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోత రామారావు మాట్లాడుతూ ఎటువంటి నిర్బంధాలు కార్మికులపై ప్రయోగించినా భయపడే పరిస్థితి లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు బి నిర్మల, కె.రాణి, కలింకోట రమణమ్మ, కొమరం చెల్లయమ్మ. మార్త మంగయమ్మ, ఐవి రమణ, కె.శాంతి రాజు, ఈతపల్లి సిరిమల్లెరెడ్డి, ఎస్.విద్యాసాగర్, పలు రంగాల కార్మికులు పాల్గొన్నారు.

రహదారిపై బైఠాయింపు

రాజవొమ్మంగి : 29వ రోజు సమ్మెలో భాగంగా అంగన్వాడీలు మంగళవారం రాజవొమ్మంగిలో భారీ ర్యాలీ నిర్వహించారు, స్థానిక అల్లూరి జంక్షన్ వద్ద మానవహారం చేశారు. రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద పెట్టున నినదించారు. అంగన్వాడీల నినాదాలతో రాజవొమ్మంగి దద్దరిల్లింది. దీంతో పోలీసులు ఆందోళనకారులను అరెస్టు చేసే ప్రయత్నం చేయగా, వారు స్వచ్ఛందంగా అరెస్టయి జైల్‌భరో నిర్వహించారు. అనంతరం పోలీస్ స్టేషన్ వద్ద బైఠాయించి ఆందోళన చేపట్టారు. అంగన్వాడీల సమ్మెకు టిడిపి మండల అధ్యక్షులు గొల్లపూడి పెద్దిరాజు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి, సిఐటియు, గిరిజన సంఘం, డివైఎఫ్ఐ నాయకులు పి.రామరాజు, కె.వెంకటలక్ష్మి, సిహెచ్.కుమారి, ఎల్ సత్యవతి, సూరకర్తం, కె లక్ష్మి, చిన్నమ్ములు, రమణి, రమణ, రత్నం, రాజేశ్వరి, మంగ, రాధ, భవాని పాల్గొన్నారు.

కూనవరం : అంగన్వాడీలు చేస్తున్న సమ్మెపై ఎస్మా ప్రయోగించడాన్ని వ్యతిరేకిస్తూ ప్రజా సంఘాల ఆధ్వర్యాన మంగళవారం ర్యాలీ నిర్వహించి, స్థానిక తహసీల్దార్ అనసూయకు వినతిపత్రం అందజేశారు. వైస్ ఎంపీపీ కొమరం పెంటయ్య, సిపిఐ నాయకులు ముండా దుర్గా ప్రసాద్, న్యాయవాది రవితేజ వారికి సంఘీభావం తెలిపి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి పాయం సీతారామయ్య, ఎంపీటీసీలు జయసుధ, అమ్మాజి, సర్పంచ్ వెంకమ్మ, తాళ్లూరి శ్రీనివాసరావు, బాబు భోగ్గయ్య, పలు సంఘాల నాయకులు రామకృష్ణ, సర్వేశ్వరరావు, సుజాత, రేణుక, పాయం జ్యోతి, సోడే లక్ష్మి పైడా దుర్గ పాల్గొన్నారు.

పాడేరు : సమ్మె చేస్తున్న అంగన్వాడీల పై రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జిఒ 2ను తక్షణం వెనక్కి తీసుకోవాలని, ఎస్ఎస్ఏ ఉద్యోగుల అక్రమ తొలగింపు నోటీసులు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సిఐటియు, ఇతర కార్మిక సంఘాలు బుధవారం పాడేరు జిల్లా కేంద్రంలో జైలు భరోను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద కార్మిక సంఘాల నేతలు రోడ్డుపై బైఠాయించారు. పోలీసులు పలువురిని అరెస్ట్ చేసి వాహనాల్లో పోలీస్ స్టేషన్ కు తరలించి అనంతరం విడుదల చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి. ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ, రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయని, కష్టజీవులు ఉసురు తగులుతుందన్నారు. సమస్యల పరిష్కరిం చాల్సిన రాష్ట్ర ప్రభుత్వం కార్మికులపై దాడి చేస్తుందని విమర్శించారు. కార్మికులు, ఉద్యోగులు, ఉపాధ్యాయుల పట్ల ముఖ్యమంత్రి జగన్ కఠినంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో లక్షలాది మంది రోడ్లపైకి ఇచ్చి ఇచ్చిన హామీలను అమలు చేయాలని, కనీస వేతనాలు పెంచాలని న్యాయమైన డిమాండ్లు కోరుతున్నారన్నారు. ఇది పెద్ద నేరంగా ప్రభుత్వం చూస్తుందన్నారు. ఉద్యమిస్తున్న కార్మికులకు, ఉద్యోగులకు పెద్ద ఎత్తున ప్రజల మద్దతు ఉందని, దీన్ని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించు కోవాలన్నారు. అనంతరం ఆర్టిసి బస్టాండ్ వద్ద రోడ్డుపై కార్మికులు బైఠాయించారు. పెద్ద ఎత్తున డిమాండ్ల పరిష్కరించాలని నినాదాలు చేశారు. అనంతరం పలువురు కార్మిక నేతలను, కార్మికులను పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కి తీసుకెళ్లి వ్యక్తిగత పూచీ కత్తుపై విడిచిపెట్టారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యవర్గ సభ్యులు ఎల్ సుందర్రావు, ఆశ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు వై మంగమ్మ, ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కే.భాగ్యలక్ష్మి, ఆదివాసి గిరిజన సంఘం నాయకులు బుచ్చిబాబు, విద్యార్థి సంఘ నాయకులు చిన్నారావు, హాస్పిటల్ పారిశుధ్య కార్మికులు, ఐకెపి కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు:సిఐటియు మండల కార్యదర్శి శంకర్ ఆధ్వర్యంలో జీవో 2ని వెనక్కి తీసుకోవాలని జైలు భరోను మంగళవారం నిర్వహించారు. అంగన్వాడీల సమ్మె శిబిరం నుండి నాలుగు రోడ్ల కూడలి వరకు రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ పోలీస్ స్టేషన్ జంక్షన్ వద్ద అంగన్వాడీలతో బైఠాయించారు. సుమారు మూడు గంటల పైబడి రాస్తారోకో చేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం మండల అధ్యక్షుడు ఎంఎం శ్రీను, సంపూర్ణ మద్దతు తెలిపారు. నిరంకుశ పాలనకు నిదర్శనంగా జీవో 2ను తీసుకువచ్చి ఎస్మా చట్టాన్ని ప్రయోగించి అంగన్వాడీలను భయభ్రాంతులకు గురి చేయడం దుర్మార్గపు చర్య అని మండిపడ్డారు. ఇష్టానుసారంగా చట్టాలు, జీవోలు తెస్తున్న జగన్ రెడ్డి ప్రభుత్వానికి రాబోయే ఎన్నికల్లో బుద్ధి చెప్పుతారన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు ఉపాధ్యక్షుడు పి.భీమరాజు, అంగన్వాడి యూనియన్ నాయకులు మోలమ్మ, సుజాత, యశోద, ఈశ్వరమ్మ భవాని, సత్యవతి, కాంతమ్మ పాల్గొన్నారు.



పాడేరులో అరెస్టు చేస్తున్న పోలీసులు



ముంచంగిపుట్టులో బైఠాయింపు



రంప చోడవరంలో...



రాజ ఒమ్మంగిలో అరెస్టు చేస్తున్న పోలీసులు



మాట్లాడుతున్న పిఒ అభిషేక్

ఆయుష్మాన్ భారత్ కార్డ్లపై అవగాహన కల్పించాలి

ఐటిడిఏ పిఓ అభిషేక్

ప్రజాశక్తి-హుకుంపేట:ఆయుష్మాన్ భారత్ కార్డుల ప్రయోజనాలపై గిరిజన గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి వి. అభిషేక్ ఆదేశించారు. భీమవరం పంచాయతీ గుమ్మడి గుండువ గ్రామంలో జరుగుతున్న ఆయుష్మాన్ భారత్ కార్డుల నమోదు కార్యక్రమాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి పి వి టి జి కుటుంబానికి ఆయుష్మాన్ భారత్ కార్డులను అందించాలని సూచించారు. ఆయుష్మాన్ భారత్ కార్డులు కలిగిన వారికి ప్రభుత్వం రూ. ఐదు లక్షల విలువైన వైద్య సహాయాన్ని ఉచితంగా అందిస్తుందని చెప్పారు. ప్రధానమంత్రి ఉజ్వల్ పథకంలో ఉచితంగా గ్యాస్ కనెక్షన్లు మంజూరు చేస్తామని చెప్పారు. ఇల్లు నిర్మించుకునే వారికి రూ.2 లక్షల 39వేలు ప్రభుత్వం మంజూరు చేస్తోందని చెప్పారు. భీమవరం పంచాయతీలో 24 మందికి ఇల్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. అందరికీ పోడుపట్టాలు ఉన్నాయా, రైతు భరోసా వస్తుందా అని అడిగి తెలుసుకున్నారు. రైతు భరోసా రాణి వారికి రైతు భరోసా అందిస్తామని సంబంధిత జాబితా సిద్ధం చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఏజెన్సీలో మేనరికపు వివాహాలతో సికిల్ సెల్ అనీమియా వస్తోందని తెలిపారు.సికిల్ సెల్ అనీమియా బాధితులకు ప్రభుత్వం రూ. 10వేల పెన్షన్ అందిస్తుందని చెప్పారు. అనంతరం ప్రాథమిక పాఠశాలను పరిశీలించి మరమ్మతు చేస్తామని చెప్పారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటరావు, గృహ నిర్మాణ శాఖ ఎఈ గౌరీ శంకర రావు ,సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.



కేక్‌ను తినిపిస్తున్న విశ్వేశ్వరరాజు

వైసిపి నేతల సంబరాలు

ప్రజాశక్తి-జి.మాడుగుల:ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి ప్రజా సంకల్ప యాత్ర తలపెట్టి 5 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మండల కేంద్రంలో మంగళవారం పాడేరు నియోజకవర్గ సమన్వయ కర్త మత్స్యరాస విశ్వేశ్వరరాజు వైసిపి నాయకులతో కలిసి కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సుధీర్ఘంగా రాష్ట్ర నలుమూల నుంచి ప్రజా సంకల్ప యాత్ర చేస్తూ ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కుడుముల సత్యనారాయణ, మండల పార్టీ అధ్యక్షులు నుర్మని మత్యకొండంనాయుడు, ఎంపిటీసీలు పాంగి చిట్టిబాబు, నానాజీ, సర్పంచులు కిముడు రాంబాబు, మాసాడి గంగరాజు, రామక్రిష్ణ, బోడిగి మత్యం నాయుడు, కొండపల్లి సత్యనారాయణ, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ పాంగి రామక్రిష్ణ, కన్వీనర్ కొర్ర సొంబాబు, సీనియర్ నాయకులు ఉల్లి పెద్దబ్బాయి పాల్గొన్నారు,



దారకొండ పిహెచ్‌సిలో పరీక్షలు చేస్తున్న డాక్టర్ హిమబిందు

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

ప్రజాశక్తి-కూనవరం

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ పి.పుల్లయ్య అన్నారు. కూనవరం సిహెచ్‌సిలో మంగళవారం జరిగిన స్కానింగ్ డే కార్యక్రమాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులకు స్కానింగ్ చేసేందుకు ప్రతి నెలా 9వ తేదీన పిఎంఎస్ఎంఎ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమాన్ని గర్భిణులు సద్వినియోగం చేసుకోవాలని, గైనకాలజిస్ట్ డాక్టర్ల సేవలు, ఆరోగ్యపరమైన సలహాలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌సి సూపరింటెండెంట్ డాక్టర్ టివి.శేషారెడ్డి, గైనకాలజిస్ట్ డాక్టర్ రాకేష్, వైద్యులు డాక్టర్ వివేక్ నాయక్, డాక్టర్ అర్బజ్ ఖాన్, హెడ్ నర్స్ బి.బొజ్జి, స్టాఫ్ నర్స్ అనసూయ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

సీలేరు : గర్భిణులు క్రమంగా వైద్య పరీక్షలు చేయించుకోవాలని దారకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డీకే హిమబిందు అన్నారు. మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధానమంత్రి సురక్షిత్ మంత్రిత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు ప్రత్యేక ఆరోగ్య తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ గర్భిణీ 9 నెలల కాలంలో ఒకసారైనా అల్ట్రాసౌండ్ స్కానింగ్ చేయించుకోవాలన్నారు. ప్రమాదకర ప్రసవాలుగా గుర్తించిన గర్భిణులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రసవ సమయానికి ఐదు రోజులు ముందుగానే ఆసుపత్రిలో చేరాలని, చింతపల్లిలో ఉన్న గర్భిణుల వసతి గృహాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌వి, ఎంఎల్‌హెచ్‌పి, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

జూనియర్ కాలేజీలో ముగ్గుల పోటీలు

ప్రజాశక్తి-చింతూరు : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సంక్రాంతి సంబరాలలో భాగంగా మంగళవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను కళాశాల ప్రిన్సిపాల్ ఎలిజిబెత్ ప్రారంభించి మాట్లాడారు విద్యార్థులందరూ తమలో దాగి ఉన్న ప్రతిభను గుర్తిస్తే మున్ముందు ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చునని తెలిపారు. ఈ పోటీలలో దాదాపు యాభై మంది విద్యార్థినులు పాల్గొని ముగ్గులు వేశారు. అనంతరం ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది భూలక్ష్మి, విజయలక్ష్మి, రాము, శైలజ, సాయి చంద్రిక విద్యార్థులు పాల్గొన్నారు.



ముగ్గులను పరిశీలిస్తున్న న్యాయ నిర్ణేతలు

యుటిఎఫ్ నేతల గృహ నిర్బంధం, ముందస్తు అరెస్టులు

ఖండించిన ఉపాధ్యాయ, ప్రజా సంఘాల నేతలు



రంపచోడవరం పోలీసు స్టేషన్‌లో యుటిఎఫ్ నేతలు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి, రంపచోడవరం

తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని ఈ నెల 9, 10 తేదీల్లో విజయవాడ ధర్నా చౌక్ వద్ద 36 గంటల దీక్ష చేస్తున్న నేపథ్యంలో ఏపి ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) నేతలను పోలీసులు ఎక్కడికక్కడ ముందస్తు అరెస్టులు, గృహ నిర్బంధం చేశారు. రాజవొమ్మంగి మండలంలో యుటిఎఫ్ నేత వెంకటలక్ష్మిని పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. రంపచోడవరంలో యుటిఎఫ్ నాయకులను ముందస్తు అరెస్టు చేసిన పోలీసు స్టేషన్‌కు తరలించారు. ప్రభుత్వ నిర్బంధ చర్యలను రాజవొమ్మంగి యుటిఎఫ్ ప్రజా సంఘాల నాయకులు దాసరి పైడిమల్లి, పొట్టబోయిన, రమణ, పి.రామరాజు, టి.శ్రీను, కె జగన్నాథం, కె సూరిబాబు తదితరులు మంగళవారం తీవ్రంగా ఖండించారు. రాజవొమ్మంగిలో మంగళవారం జరిగిన యూటీఎఫ్ సమావేశంలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు మిరియాల సత్యవతి, తాడే వెంకట లక్ష్మీ ప్రసన్న, బీర బోయిన వెంకటలక్ష్మీ, ఉదయ్, రమణ, పైడిమల్లు, రమేష్ బాబు, పరిశిక సుబ్బరావు, జంపా రాంబాబు, రెడ్డి లక్ష్మీ, విజయ కుమారి, రాధ, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇవ్వాల్సిన 18 వేల కోట్ల రూపాయల బకాయిలు చెల్లించాలని ప్రజాస్వామిక పద్ధతిలో పోరాటం చేస్తున్న యూటీఎఫ్ ఉపాధ్యాయులపై నిర్బంధాన్ని ప్రయోగించి, అరెస్ట్ చేయడాన్ని యుటియఫ్ అల్లూరి సీతారామరాజు జిల్లా అధ్యక్షుడు వై విల్సన్ బాబు, జిల్లా కార్యదర్శి కె ఆదిరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు.



రాజవొమ్మంగిలో గృహ నిర్బంధంలో ఉన్న యుటిఎఫ్ నాయకులు

తాగునీటి కోసం ఖాళీ బిందెలతో నిరసన

జాతీయ రహదారిపై బైఠాయించిన మహిళలు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

మండలంలోని ఒట్టిగడ్డ గ్రామంలో మంచినీటి సౌకర్యం పునరుద్ధరించాలని కోరుతూ ఆ గ్రామానికి చెందిన మహిళలు, సర్పంచ్ ఆగూరి సుబ్బలక్ష్మి, ఎంపీటీసీ నిర్మలాదేవిలా ఆధ్వర్యంలో ఖాళీ బిందెలతో ఒట్టిగడ్డ గ్రామ జాతీయ రహదారిపై మంగళవారం సాయంత్రం బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ సుబ్బలక్ష్మి, ఎంపీటీసీ నిర్మలాదేవి, మహిళలు మాట్లాడుతూ నాలుగు నెలల క్రితం తమ గ్రామంలో నూతనంగా నిర్మాణం చేపట్టిన జాతీయ రహదారి పనుల్లో భాగంగా తమకు మంచినీరు సరఫరా అయ్యే పైపులను తొలగించడం జరిగిందని, నాటి నుండి పైపులను పునరుద్ధరించకపోవడంతో తమకు మంచినీరు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జాతీయ రహదారి నిర్మాణానికి రోడ్డుకు ఇరువైపులా నిర్మించిన డ్రైయిన్ పూర్తిస్థాయిలో చేపట్టకపోవడంతో వర్షం వచ్చిన సమయంలో డ్రైయిన్‌ల నుండి నీరు వచ్చి పక్కనే ఉన్న ఇళ్లపైకి వెళ్లడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని వాపోయారు. దీనిపై హైవే అధికారులు, ప్రభుత్వ అధికారులకు ఫిర్యాదు చేసినా సమస్య పరిష్కారం కాలేదన్నారు. సుమారు గంటసేపు జాతీయ రహదారిపై బైఠాయించడంతో రహదారిపై రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న హైవే అధికారులు ఈ సమస్యను మూడు రోజుల్లో పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో మహిళలు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.



ఖాళీ బిందెలతో రోడ్డుపై బైఠాయించిన మహిళలు



సుభర్జీని మృతదేహాన్ని బయటకు తెస్తున్న ఈతగాళ్లు

వాగులో పడి ఇద్దరు డిగ్రీ విద్యార్థుల మృతి

ప్రజాశక్తి-రంపచోడవరం

మండలంలోని ఐ.పోలవరం గ్రామ సమీపంలోని సీతపల్లి వాగులో పడి ఇద్దరు డిగ్రీ విద్యార్థులు మృతి చెందారు. వీరు రాజమండ్రి వారుగా పోలీసులు గుర్తించారు. పోలీసుల కథనం ప్రకారం.... రాజమండ్రి ఆర్ట్స్ కళాశాలలో డిగ్రీ ప్రథమ సంవత్సరం చదువుతున్న నలుగురు విద్యార్థులు రాజమండ్రి నుండి రంపచోడవరం మండలం ఐ.పోలవరంకు విహార యాత్రకు వచ్చారు. పోలవరం సమీపంలోని సీతపల్లి వాగు వద్ద ప్రమాదవశాత్తు మహమ్మద్ జబ్బీర్ (18) సుభర్జీని (18) వాగులో పడి గల్లంతయ్యారు. దీనిని గమనించిన మరో ఇద్దరు మిత్రులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో హుటాహుటిన సంఘటనా స్థలానికి సీఐ వెంకటేశ్వరరావు ఆధ్వర్యాన పోలీసులు సమీప గ్రామంలోని ఈతగాళ్ల సహాయంతో మతదేహాలను వెలికి తీసేందుకు గాలింపు చర్యలు చేపట్టారు. కొద్దిసేపటికి ఇద్దరి మృతదేహాలను వెలికి తీశారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మహమ్మద్ జబ్బీర్ మృతదేహం

11, 12 తేదీల్లో అంతర రాష్ట్ర ఫుట్‌బాల్ టోర్నీ

ప్రజాశకి-చింతూరు : అల్లూరి సీతారామరాజు ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యాన మన్యం కప్ అంతర రాష్ట్ర ఫుట్‌బాల్ టోర్నమెంట్ ఈ నెల 11, 12 తేదీల్లో చింతూరు గ్రౌండ్‌లో నిర్వహిస్తున్నట్లు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షులు పూనెం కిరణ్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ జిల్లాలో ఫుట్‌బాట్ క్రీడ అభివృద్ధే లక్ష్యంగా ఈ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి వేక రాజ్‌కుమార్, జాయింట్ సెక్రెటరీ పాయం రామారావు, గౌరవాధ్యక్షులు సున్నం వెంకటేశ్వర్లు, సభ్యులు బంగారు రాజు తదితరులు పాల్గొన్నారు.

29వ రోజుకు అంగన్‌వాడీల సమ్మె



హుకుంపేటలో నినాదాలు చేస్తున్న అంగన్‌వాడీలు

ప్రజాశక్తి- యంత్రాంగం

దుంబ్రిగుడ: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్వాడీ కార్మికులు చేపడుతున్న సమ్మె మంగళవారానికి 29 వ రోజుకు చేరుకుంది .ఈ సందర్భంగా మండల కేంద్రంలోని హైవే రోడ్డు యూనియన్ బ్యాంక్ జంక్షన్ వద్ద కార్మికులు ధర్నా చేపట్టారు. సమస్యలు పరిష్కరించాల్సింది పోయి ఏటువంటి బెదిరింపులకు పాల్పడిన వెనక్కి తగ్గేది లేదని అంగన్వాడీ కార్మికులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు, అంగన్వాడి కార్మికులు ,హెల్పర్లు తదితరులు పాల్గొన్నారు.

హుకుంపేట: జీవో 2ను వెంటనే రద్దు చేయాలని వైస్ ఎంపీపీ సూడిపల్లి కొండలరావు డిమాండ్ చేశారు. స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం వద్ద అంగన్వాడీలు చేపడుతున్న దీక్ష మంగళవారంతో 29వ రోజు చేరుకుంది. ఈ సందర్భంగా కొండలరావు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎస్మా చట్టం వెంటనే రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి టి.అప్పలకొండ పడాల్, అంగన్వాడి నాయకులు అప్పలకొండమ్మ, కృష్ణవేణి, పద్మ, కుమారి పాల్గొన్నారు.



విఆర్.పురంలో 29వ రోజు నిరసన...

పెదబయలు: స్థానిక అంబేద్కర్ కూడలి వద్ద అంగన్వాడీల సమ్మె కొనసాగింది. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు రాజమ్మ, పద్మ, మంగ, కొండమ్మ, సుశీల పాల్గొన్నారు.

అనంతగిరి: మండలంలో అంగన్వాడీలు సమ్మెను కొనసాగించారు. ఎస్మా చట్టం ప్రయోగించి భయభ్రాంతులకు గురి చేస్తే వెనుకాడేది లేదని అంగన్వాడి యూనియన్ నాయకురాలు కళావతి, మంజుల, కె.లక్ష్మీ తెలిపారు. సిఐటియు మండల కార్యదర్శి కె.మొస్య మద్దతు పలికారు.

విఆర్.పురం : మండలంలోని రేకపల్లి వద్ద సమ్మె ప్రాంగణంలో 29వ రోజు నిరసన కొనసాగింది. ఈ సందర్భంగా అంగన్వాడీలంతా ఎర్ర చీరలు ధరించి సిఐటియు, 29 ఆకారంతో కూర్చొని నిరసన తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు పూనెం సత్యనారాయణ, సున్నం రంగమ్మ, యూనియన్ నాయకులు రాజేశ్వరి, వర్కర్లు పాల్గొన్నారు.

చింతూరు : మండల కేంద్రంలో అంగన్వాడీల దీక్షలను యూనియన్ కార్యదర్శి నూక రత్నం, అధ్యక్షులు వెంకటరమణ ప్రారంభించారు. అనంతరం స్థానిక ఐటీడీఏ నుండి చింతూరు సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. వీరికి సిపిఎం నాయకులు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు సీసం సురేష్, ఎర్రంశెట్టి శ్రీనివాసరావు, సిఐటియూ నాయకులు పోడియం లక్ష్మణ్, తేపలా లక్ష్మయ్య, వివిధ సంఘాల నాయకులు సురేష్, కామేశ్వరి, జయ, కన్నకదుర్గ, చిట్టమ్మ, చుక్కమ్మ, సత్యవతి, విజయకుమారి, భద్రమ్మ, దుర్గ పాల్గొన్నారు.

సీలేరు : జీకే వీధి మండల కేంద్రంలో అంగన్వాడీలు 29వ రోజు ఆందోళన కొనసాగించారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి గడుదురు సత్యనారాయణ, యూనియన్ నాయకులు పోతురాజు కృష్ణకుమారి, సోమేలి, అప్పలనర్స, ఎల్.సత్యవతి తదితరులు పాల్గొన్నారు.



చింతూరులో ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీలు




సీలేరులో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

నేరాలు ఘోరాలు

ఆయిల్ ట్యాంకర్ ఢీకొని మహిళ మృతి

ప్రజాశక్తి-పాడేరు: స్థానిక ఎస్పీ కార్యాలయం సమీపంలో ప్రధాన రహదారిపై మంగళవారం సాయంత్రం ఆయిల్ ట్యాంకర్ ఢీకొని గిరిజన మహిళ దుర్మరణం చెందింది. వివరాలు ఇలా ఉన్నాయి. పాడేరు మండలంలోని వణుకుపల్లి గ్రామానికి చెందిన పూజారి రామ కొండబాబు తన భార్య గిరిజతో కలిసి బైక్ పై పాడేరు వస్తున్నారు. వెనుక వస్తున్న ఆయిల్ ట్యాంకర్ బైక్ ను ఢీకొనడంతో ఈ ప్రమాదం సంభవించింది. గిరిజ బైక్ పై నుంచి తూలి ఎడమవైపు ట్యాంకర్ వెనుక చక్రాల కింద పడిపోవడంతో అక్కడికక్కడే ఆమె మృతి చెందింది. గాయాల పాలైన రామకొండ బాబును పాడేరు ఆసుపత్రికి తరలించారు. అస్వస్థతతో ఉన్న బంధువును పరామర్శించేందుకు పాడేరు వస్తున్నామని ట్యాంకర్ ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగిందని క్షతగాత్రుడు రామకొండ బాబు విలేకరులకు తెలిపారు.

30 లీటర్ల సారా స్వాధీనం



నిందితునితో పోలీసులు

ప్రజాశక్తి-హుకుంపేట: నాటు సారా తయారీ రవాణా చట్టా రీత్యా నేరమని ఎస్ఐ సతీష్ అన్నారు. 30 లీటర్ల నాటు సారా పట్టుకోవడం జరిగిందని అన్నారు. మండలంలోని సంతారి పంచాయతీ గ్రామానికి చెందిన కోడెలి వెంకటరమణ తన ఇంటి వద్ద నాటు సారా అమ్మకాలు జరుపుతూ పట్టుబడ్డాడని తెలిపారు. కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్కు తరలించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. అనంతరం గన్నేరు పుట్టు పంచాయతీ గ్రామంలో 400 లీటర్ల నాటు సారా పులుపును ధ్వంసం చేశామని ఆయన తెలిపారు.



సంతకు తరలి వచ్చిన గిరిజనులు

తారుమారు సంతలో సంక్రాంతి శోభ

ప్రజాశక్తి-జి.మాడుగుల

తారుమారు సంతతో మండల కేంద్రంలో సంక్రాంతి పండగ శోభ నెలకొంది. ప్రతి మంగళవారం మండల కేంద్రానికి అతి దగ్గరగా ఉన్న సంతబయలు గ్రామంలో వారపు సంత జరుగుతుంది. సంక్రాంతి సందర్భంగా జిమాడుగుల మండల కేంద్రంలో సంత ఏర్పాటు చేయడం పూర్వం నుండి ఆనవాయితీగా వస్తుంది. మంగళవారం మండల కేంద్రంలో వెంకట్ రాజు ఘాటు వద్ద నిర్వహించిన వారపు సంతకు విశేష స్పందన వచ్చింది. సుమారు మూడు జిల్లాల నుండి వ్యాపారస్తులు గిరిజనులకు కావలసిన పలు రకాల సామాగ్రిని తీసుకువచ్చారు. అలాగే గిరిజనులు కుటుంబ సమేతంగా భారీ స్థాయిలో సంతకు తరలివచ్చి బంధువులను ముందుగా ఒకరినొకరు జోరా అంటూ ఆప్యాయంగా పలకరించుకొని సంక్రాంతి పండుగకు తమ ఇంటికి రావాలని కోరారు. సంక్రాంతి పండుగ తో కావలసిన నూతన దుస్తులు సామాగ్రిని పూర్తిస్థాయిలో కొనుగోలు చేసుకున్నారు. ఇటు వ్యాపారస్తులకు అటు సంతకు వచ్చిన గిరిజనులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా స్థానిక సర్పంచ్ రాంబాబు మత్స్యరాస నాగరాజు ఏర్పాట్లు చేశారు. ట్రాఫిక్ ఎటువంటి అంతరాయం ఏర్పడకుండా సిఐ రమేష్, ఎస్ఐ శ్రీనివాస్ ఏర్పాట్లు చేశారు.

అక్రమ అరెస్టులు దుర్మార్గం : యుటిఎఫ్

ప్రజాశక్తి -అనంతగిరి: ఈ నెల 9,10 తేదీల్లో విజయవాడ ధర్నా చౌక్ వద్ద యూటిఎఫ్ 36 గంటల దీక్షకు భగ్నం చేసేందుకు ప్రభుత్వం యుటిఎఫ్ నేతలను అడ్డుకోవడం, నిర్బంధించడం, అరెస్టులు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అల్లూరి సీతారామరాజు జిల్లా యూటిఎఫ్ జిల్లా కార్యదర్శి పుడిగి.దేముడు ఖండించారు. స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ, పెండింగ్ డిఏలు, పిఆర్సి బకాయిలు, పిఎఫ్ లోన్లు తదితర ఆర్థిక బకాయిలను వెంటనే విడుదలచేయాలని నిరసన చేపట్టినా ప్రభుత్వం స్పందించక పోవడం అన్యాయమన్నారు.

దుంబ్రిగుడ: విజయవాడ ధర్నా చౌక్ వద్ద 36 గంటల దీక్షకు భగ్నం చేస్తూ యుటిఎఫ్ అధినాయకత్వాన్ని అడ్డుకోవడం, అరెస్టులు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఆ సంఘం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి కె రాజారావు, ఎస్ బాలకృష్ణ ఖండించారు. ఆర్థిక బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు.

ముంచింగిపుట్టు: విజయవాడ ధర్నా చౌక్ వద్ద 36 గంటల దీక్షకు భగ్నం చేస్తూ యుటిఎఫ్ నేతలను అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అల్లూరి సీతారామరాజు జిల్లా యూటిఎఫ్ జిల్లా కార్యదర్శి మొశ్యా ధర్మారావు ఖండించారు.

ఎముకల వైద్య శిబిరం

ప్రజాశక్తి - చింతపల్లి: మండలంలోని తాజంగిలో డాన్ బోస్కో కాలేజ్ ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ కైరో ప్రాక్టిక్ వైద్య శిబిరం మంగళవారం నిర్వహించారు. 200 మంది జాయింట్ నొప్పుల బాధితులు అనకాపల్లి జిల్లా నర్సీపట్నం పెద్ద బొడ్డేపల్లి చెందిన డాన్ బోస్కో కాలేజ్ ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ కైరో ప్రాక్టిక్ ట్రీట్మెంట్ ఇన్చార్జి డాక్టర్ ఫదర్ బెన్నీ ఆధ్వర్యంలో తాజంగి జియుపి స్కూల్ వైద్య శిబిరం నిర్వహించారు. సుదూర ప్రాంతాల నుంచి కూడా ఏళ్ల తరబడి మోకాలు, నడుము, వెన్నుముక, కీళ్ల నొప్పులతో బాధపడుతున్న వారంతా తరలి వచ్చారు. ఈ కార్యక్రమంలో అమెరికా వైద్యులు సఫీరా క్రైసర్, రాబిన్ క్రైసర్, సారా. టామ్, సెరిల్, ఎమిలి, కైల్. మహేష్ పాల్గొన్నారు.

కొనసాగిన సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె

ఎస్ఎస్ఎ ఉద్యోగి మృతికి సంతాపం



నివాళులర్పిస్తున్న ఉద్యోగులు, నేతలు

ప్రజాశక్తి-పాడేరు: సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె మంగళవారం కొనసాగింది. జిల్లా కేంద్రం పాడేరులో ఐటీడీఏ ఎదుట నిరవధిక నిరసన దీక్ష కు వివిధ మండలాల నుంచి సమగ్ర శిక్ష ఉద్యోగులు తరలి వచ్చారు. ఈ సందర్భంగా తమను రెగ్యులర్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని సమగ్ర శిక్ష ఉద్యోగులు నినాదాలు చేశారు. అనకాపల్లి జిల్లా మునగపాక మండల కేంద్రంలో సమగ్ర శిక్ష డేటా ఎంట్రీ ఆపరేటర్ గా పని చేస్తున్న వాసుదేవరావు ప్రభుత్వం తీరు పట్ల తీవ్ర మానసిక ఒత్తిడికి గురై ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా ఈనెల 21న మృతి చెందడం పై దీక్ష శిబిరంలో సమగ్ర శిక్ష ఉద్యోగులందరూ నివాళులర్పించి సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు అల్లూరి జిల్లా ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు, సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘ నాయకులు జయరాజ్, అనిల్ కుమార్, సింహాచలం, అంగన్వాడి వర్కర్స్ యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసి గిరిజన సంఘం మద్దతు

పాడేరు: పాడేరు ఐటీడీఏ ముందు సమగ్ర శిక్ష ఉద్యోగులు చేస్తున్న సమ్మెకు ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.బాలదేవ్ మద్దతు తెలిపారు. మంగళవారం ఆయన నిరసన దీక్ష శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని వేతన సమస్యల్ని పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

నైపుణ్యాభివృద్ధితో సామాజిక సేవ



ఇటలీ వైద్య నిపుణుడిని అభినందిస్తున్న గీతం అధ్యక్షుడు శ్రీభరత్

ప్రజాశక్తి- విశాఖపట్నం :వైద్యులు నిరంతరం నైపుణ్యాలను మెరుగుపరచుకుని, సమాజసేవలో పునరంకితం కావాలని గీతం అధ్యక్షుడు ఎం.శ్రీభరత్ పిలుపునిచ్చారు. మంగలవారం గీతం దంత వైద్య కళాశాల,ఆసుపత్రి, ఇండియన్ డెంటల్ అసోసియేషన్, విశాఖశాఖ సంయుక్త ఆధ్వర్యాన దంతవైద్యంలో నూతన విధానాలపై ప్రత్యేక సదస్సున నిర్వహించారు. నిరంతర విద్యావిధానంలో భాగంగా నిర్వహించిన సదస్సులో ఇటలీకి చెందిన ప్రఖ్యాత దంత వైద్య నిపుణుడు డాక్టర్ గియోవన్ని కావల్లీ పాల్గొని, క్షీణించిన దంతాలను చికిత్స ద్వారా ఏవిధంగా సరిచేయవచ్చో వివరించారు. గీతం దంత వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి. సీతారామరాజు అధ్యక్షతన జరిగినకార్యక్రమంలో ఐడిఎ విశాఖశాఖ అధ్యక్షుడు డాక్టర్ కందర్ప శ్రీనివాస్, గీతం కన్సర్వేటివ్ డెంటిస్ట్రీ విభాగం అధిపతి డాక్టర్ కె.శిరీష పాల్గొన్నారు.

గీతంలో ముగిసిన క్రీడా పోటీలు



ఆటల పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

ప్రజాశక్తి- విశాఖపట్నం : ఈ నెల 10,11 తేదీలలో గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో నిర్వహించనున్న జాతీయస్థాయి యువజనోత్సవం, గీతం ఎక్సలెన్స్ మీట్-2024లో భాగంగా నిర్వహించిన జెమ్ ప్రీమియర్ లీగ్ క్రీడా పోటీలు మంగళవారంతో ముగిశాయి. గీతం బిజినెస్ స్కూల్ ఆధ్వర్యంలో వివిధ రాష్ట్రాలు, ప్రాంతాల నుంచి వచ్చిన పలు కళాశాలల విద్యార్థులకు క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీబాల్, త్రోబాల్, వాలీబాల్, అథ్లెటిక్స్, చదరంగం పోటీలను నిర్వహించారు. విజేతలను గీతం బిజినెస్ స్కూల్ డీన్ ప్రొఫెసర్ రాజా ఫణిపప్పు అభినందించి,.గీతం ఎక్సలెన్స్ మీట్ ముగింపు రోజున బహుమతులు అందస్తామన్నారు.

బొడ్లంకలో టిడిపి, జనసేన ప్రచారం



ప్రచారం చేస్తున్న టిడిపి, జనసేన నేతలు

ప్రజాశక్తి-మారేడుమిల్లి : మండలంలోని చావడికోట పంచాయితీ పరిధి బొడ్లంక గ్రామంలో బాబు షూరిటి భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమం టిడిపి జనసేన నాయకులు మంగళవారం చేపట్టారు. ఇంటింటికి తిరుగుతూ, భవిష్యత్తులో చేపట్టబోయే ఉమ్మడి కార్యక్రమాలు ప్రజలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చావడికోట సర్పంచ్ సాదల ప్రేమ కుమార్ రెడ్డి, మాజీ ఎంపిపి పల్లాల లక్ష్మీ భూపతి రెడ్డి, మాజీ సర్పంచ్ ముర్ల కనక భూషణం, టిడిపి నాయకులు పల్లాల రాజ్ కుమార్ రెడ్డి, గురుకు శేషు కుమార్, మండ రత్నాజీ, పాము రాంబాబు, సాదల రవీంద్రారెడ్డి, జనసేన నాయకులు మళ్ల దుర్గాప్రసాద్, కర్రి సన్యాసి రెడ్డి, పి.వాసు దేవరెడ్డి, పల్లాల మంగమ్మ పాల్గొన్నారు.

వేతన బకాయి చెల్లించాలని వినతి

ప్రజాశక్తి-చింతూరు : ప్రభుత్వ పాఠశాలలో స్లీపర్లుగా పనిచేస్తున్న శానిటేషన్ వర్కర్లకు 6 నెలల నుండి పెండింగ్‌లో ఉన్న వేతనాలు తక్షణమే చెల్లించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యాన మంగళవారం ఐటిడిఎ ఎఒకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి పొడియం లక్ష్మణ్ మాట్లాడుతూ కార్మికులకు ప్రభుత్వం సక్రమంగా సకాలంలో జీతాలు చెల్లించకుండా వెట్టి చాకిరీ చేయించుకుంటుందని విమర్శించారు. విద్యార్థులు ఎటువంటి అనారోగ్యానికి గురికాకుండా పాఠశాల ఆవరణ, మరుగుదొడ్లను శుభ్రం చేస్తున్న శానిటేషన్ వర్కర్లకు తక్షనమే పెండింగ్ జీతాలు చెల్లించాలని, పరికరాలు, గ్లౌజులు, శానిటైజర్లు, షూలు, చీపుర్లు పంపిణీ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ వర్కర్ల యూనియన్ నాయకులు సురేష్, కమల, వర్కర్లు పాల్గొన్నారు



ఐటిడిఎ ఎఒకు వినతిపత్రం ఇస్తున్న స్కూల్ శానిటేషన్ వర్కర్లు

శానిటేషన్ వర్కర్స్ యూనియన్ మండల కమిటీ ఎన్నిక



శానిటేషన్ వర్కర్ల కమిటీతో సిఐటియు నేత సత్యనారాయణ

ప్రజాశక్తి-విఆర్.పురం : స్కూల్ శానిటేషన్ వర్కర్స్ యూనియన్ మండల కమిటీ ఎన్నిక మంగళవారం జరిగింది. మండల కేంద్రంలో మంగళవారం జరిగిన యూనియన్ సమావేశంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి పూనెం సత్యనారాయణ మాట్లాడుతూ కార్మికులందరూ కలిసికట్టుగా పోరాటం చేయాలన్నారు.

సమాన పనికి సమాన వేతనం ప్రభుత్వం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం యూనియన్ మండల అధ్యక్షులుగా కారం రంగమ్మ, కార్యదర్శిగా సోడి వరలక్ష్మి, 12 మంది కమిటీ సభ్యులు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా కమిటీ సభ్యులు ఎం.రాజేశ్వరి స్కూల్ శానిటేషన్ వర్కర్లు పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్ర మండల స్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-విఆర్.పురం

ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా మండల స్థాయి క్రికెట్ పోటీలను మండలంలోని రేఖపల్లి గ్రౌండ్‌లో గ్రామ సర్పంచ్ పూనెం సరోజిని, ఎంపీటీసీ బంధం విజయలక్ష్మి మంగళవారం ప్రారంభించారు. తొలి మ్యాచ్ రేఖపల్లి సచివాలయం, పెద్దమట్టపల్లి జట్లు మధ్య జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ సరోజిని మాట్లాడుతూ క్రీడాకారుల ప్రతిభను వెలికితీయడానికి ఈ క్రీడలు దోహదం చేస్తాయని చెప్పారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా సభ్యులు పూనెం సత్యనారాయణ, ఎస్టి, ఎస్సి డివిజన్ సభ్యులు చిక్కాల బాలు, ఇన్చార్జి ఎంపీడీవో రత్నకుమారి, రేఖపల్లి సెక్రటరీ శివప్రసాద్, పెద్ద మట్టపల్లి సెక్రటరీ రామారావు, చిన్నమట్టపల్లి సెక్రటరీ, సచివాలయాల సిబ్బంది, క్రీడాకారులు పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న సర్పంచ్, ఎంపిటిసి

ఉత్సాహంగా పవర్ లిఫ్టింగ్ పోటీలు

ప్రజాశక్తి- సీతమ్మధార : ఆంధ్రా యూనివర్సిటీ అంతర్ కళాశాలల మహిళలు, పురుషుల పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలు స్థానిక డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాలలో నిర్వహించారు. కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ డాక్టర్ జి.మధుకుమార్ ప్రారంభించిన పోటీల్లో డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కాలేజీ పురుషులు, మహిళల జట్లు విజేతలుగా నిలవగా, డాక్టర్ లంకపల్లి బుల్లయ్య ఇంజనీరింగ్ కాలేజీ జట్లు రన్నరప్‌గా నిలిచాయి. పోటీలకు న్యాయ నిర్ణేతలుగా ఎస్.కోటేశ్వరరావు, ఎం ప్రభాకర్, డాక్టర్ రత్నాకర్ వ్యవహరించారు.ఎయు వెయిట్ లిఫ్టింగ్ కోచ్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జిఎస్‌కె చక్రవర్తి, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ డి.దీపక్ చౌదరి, వ్యాయామ విభాగాధిపతి డాక్టర్ వై. శ్రీనివాసరావు, ఫిజికల్ డైరెక్టర్స్ డాక్టర్ బిఆర్ లక్ష్మణరెడ్డి యు.గంగాభవాని పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి -గోపాలపట్నం : గోపాలపట్నం ఉన్నత పాఠశాల నుండి ఏజెన్సీ ప్రాంతానికి బదిలీ అయిన ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు అన్నారు. మంగళవారం గోపాలపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులతో సమావేశమై సమస్యలు అడిగి తెలుసుకున్నారు. జిల్లాల ప్రెసిడెన్షియల్ గెజిట్‌ను త్వరగా పాస్ చేయడం, ప్రమోషను ప్రక్రియ వేగవంతం చేయడం ద్వారా ఏజెన్సీకి బదిలీ అయిన ఉపాధ్యాయులను ఆగస్టులోగా తిరిగి సొంత జిల్లాలకు పంపేలా కృషి చేస్తానన్నారు. పిఆర్‌టియునేతలు గోపీనాథ్, శివశంకర్‌నాయుడు ఏజెన్సీ టీచర్స్ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు

ఉత్తరాంధ్ర ఇన్‌ఛార్జిని కలిసిన కాంగ్రెస్ నేతలు

ప్రజాశక్తి -గాజువాక : విశాఖ పర్యటనలో ఉన్న . ఉత్తరాంధ్ర కాంగ్రెస్ ఇన్‌ఛార్జి పి.రాకేష్ రెడ్డిని గాజువాక సమన్వయ కర్త జెర్రిపోతుల ముత్యాలు, పశ్చిమ సమన్వయకర్త అంగావర్మ, 64వ వార్డు పార్టీ అధ్యక్షులు యరబాల భూలోక, గాజువాక ఎస్‌సి సెల్ నాయకులు ములకలపల్లి రాజుబాబు మర్యాదపూర్వకంగా కలిశారు. గాజువాక, పశ్చిమ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ బలోపేతంపై చర్చించారు..

ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యాన స్వచ్ఛ భారత్



స్వచ్ఛ భారత్‌లో పాల్గొన్న ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు

ప్రజాశక్తి -సీలేరు :సీలేరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ శ్రీనివాస్ ఆధ్వర్యాన కాలేజీ జాతీయ సేవా పథకం వాలంటీర్లు మంగళవారం వై.రామవరం మండలం, బొడ్డగండి పంచాయితీ పరిధి బచ్చులూరు గ్రామంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు గ్రామ పరిసరాలను పరిశుభ్రం చేశారు. అనంతరం గిరిజనులతో సమావేశం పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రోగ్రామ్ ఆఫీసర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఇంటి పరిసరాలతో పాటు గ్రామంలో చెత్తాచెదారాలు పేరుకుపోతే కుళ్ళ పోయి దుర్వాసన కలగడమే కాకుండా వ్యాధులు సంభవిస్తాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ పరిశుభ్రతపై దృష్టి సారించాలని కోరారు. ప్రజా ప్రతినిధులు, గ్రామ ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు.

12 నుండి ఉచిత కంప్యూటర్ శిక్షణ



పిఒకు ఆహ్వానపత్రం ఇస్తున్న స్వేఛ్ఛ సంస్థ ప్రతినిధులు

ప్రజాశక్తి మారేడుమిల్లి : విజయవాడ స్వేచ్ఛ సొసైటీ ఆధ్వర్యంలో ఈనెల 12 నుండి వేటుకూరు పంచాయతీ పరిధిలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఉచిత కంప్యూటర్ శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు స్వేచ్ఛ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ శ్రీపతి రాయ్ తెలిపారు. ఈ మేరకు ప్రారంభోత్సవానికి హాజరు కావాలని రంపచోడవరం ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరేకు మంగళవారం ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా రాయ్ మాట్లాడుతూ కంప్యూటర్‌పై ఆసక్తి ఉన్న గిరిజనులు ఈ ఉచిత శిక్షణను ఉపయోగించుకోవాలని కోరారు. ముఖ్యముగా గ్రూప్-1, 2కు ప్రిపేరయ్యే విద్యార్థులకు ఈ శిక్షణ కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందని చెప్పారు.

సంతకాల సేకరణ

ప్రజాశక్తి రంపచోడవరం : ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఈ నెల 19న బెజవాడ స్వరాజ్ మైదానం స్మృతివనంలో 125 అడుగుల భారీ అంబేద్కర్ విగ్రహావిష్కరణ చేయనున్న నేపథ్యంలో మండలంలోని తామరపల్లి సచివాలయంలో మంగళవారం సంతకాల సేకరణ చేశారు. ముసురుమిల్లి ఎంపీటీసీ వంశి కుంజం అంబేద్కర్ చిత్రపటాన్ని కి పూలుమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అనంతరం సంతకాల సేకరణ చేపట్టారు. కార్యక్రమంలో సచివాలయం కన్వీనర్ కుంజ అబ్బులు, గృహ సారిథి చిరంజీవి, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

యువత క్రీడల పట్ల ఆసక్తి చూపాలి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న జెడ్‌పిటిసి

ప్రజాశక్తి - విఆర్.పురం :యువత వక్రమార్గాల వైపు వెళ్లకుండా క్రీడ పట్ల ఆసక్తి చూపాలని జెడ్పిటిసి వాళ్ళ రంగారెడ్డి అన్నారు. మండలంలోని ముద్దుల గూడెంలో జరుగుతున్న నాలుగు మండలాల వాలీబాల్ పోటీలను మంగళవారం ఆయన సందర్శించి తిలకించారు. ఈ వాలీబాల్ టోర్నీలో విజేతలకు మొదటి బహుమతి రూ.15000 రెండవ బహుమతి 10000 అందజేయనున్నట్లు ముద్దుల గూడెం గ్రామ వాలీబాల్ టోర్నీ నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో చిన్నమట్టపల్లి ఎంపిటిసి ప్రదీప్ కుమార్, టిడిపి రాష్ట్ర ఎస్టి సెల్ కార్యదర్శి సవలం రాజేంద్రప్రసాద్, టోర్నమెంట్ నిర్వాహకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.